సాక్షి ఒడిశా
బుధవారం । 24 । ఏప్రిల్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3.52.547లు, బంగారం 750 మిల్లీగ్రాములు వెండి 800 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



జోరందుకుంటున్న ప్రచారం

రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం ఈ వారంలో ఊపందుకోనుంది. ప్రధానంగా బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీల అగ్రనేతలు ప్రచారానికి రంగంలోకి దిగుతున్నారు.

- 8లో



పద్మ పురస్కారాలు ప్రదానం

రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రముఖులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారాలు మంగళవారం ప్రదానం చేశారు.

- 8లో

నామినేషన్ల కోలాహలం

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నాలుగో విడత నామినేషన్లకు గడువు సమీపిస్తుండడంతో మంగళవారం పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. అభ్యర్థులు తమ మద్దతుదారులతో ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రత్యేక పూజలు నిర్వహించి నామినేషన్లు వేసేందుకు బయల్దేరారు. వారితో పాటు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

– సాక్షి నెట్‌వర్క్



రాయగడ: బీజేడీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న అనసూయా మాఝి



రాయగడ: గుణుపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా సత్యజీత్ గొమాంగో నామినేషన్



రాయగడ: బిసంకటక్ అసెంబ్లీ స్థానానికి బీజేడీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న జగన్నాథ సరక



కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న నీలమాధవ హికక



బీఎస్పీ అభ్యర్థిగా జితు జకసిక నామినేషన్



మల్కన్‌గిరి: బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న లలిత్ మడ్కమి



రాయగడ: గుణుపూర్‌లో స్వతంత్ర అభ్యర్థిగా సాబొరొ నామినేషన్ దాఖలు చేస్తున్న దృశ్యం



రాయగడ: బీఎస్పీ నుంచి పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన పూర్ణచంద్ర మాఝి

న్యూస్‌రీల్

బీజేడీలోకి నిశాంత్



రబి నారాయణ నందోతో నిశాంత పట్నాయక్

జయపురం: పట్టణంలో అన్ని కార్యక్రమాల్లో తానై ముందుండి పనిచేసే సోషల్ వర్కర్ నిశాంత పట్నాయక్ మంగళవారం బీజేడీలో చేరారు. అతడు మాజీ మంత్రి, బీజేడీ నాయకుడు రబినారాయణ నందో ఇంటికి వెళ్లి ఆ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించాడు. ఆయనకు రబినారాయణ నందో కండువా కప్పి బీజేడీలోకి ఆహ్వానించారు. నిశాంత తమ పార్టీలో చేరడం వలన పార్టీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ



సుకుందాలో మొక్కలు నాటుతున్న సుబుజ బాని సంస్థ ప్రతినిధులు

బరంపురం: పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సుబుజ బాని సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. బరంపురం అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నగర శివార సుకుండా గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సుబుజ బాని సంస్థ ప్రతినిధులు, యువతి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

కబిసూర్యనగర్‌లో హత్య



సంఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బరంపురం: స్థానిక కబిసూర్యనగర్‌లో ఒక వ్యక్తి హత్యకి గురైన ఘటన జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఐఐసీ తపన్ కుమార్ మిశ్రా తెలిపిన వివరాల మేరకు.. సోమవారం రాత్రి కళ్లికోట్ నుంచి బడంబరి గ్రామంలోని తన ఇంటికి గణేష్ నాయక్ అనే వ్యక్తి వెళ్తున్నాడు. అదే సమయంలో కబిసూర్యనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ప్రత్యర్థులు గణేష్ నాయక్‌పై దాడిచేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం బరంపురం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి నిందితులను గాలిస్తున్నట్లు ఐఐసీ తపన్ కుమార్ మిశ్రా తెలియజేస్తున్నారు.

గంజాంలో సీఎం నవీన్ పర్యటన నేడు



బరంపురం: గంజాం జిల్లాలో సీఎం నవీన్ పట్నాయక్ బుధవారం పర్యటించనున్నారు. దీనిలో భాగంగా శనివారం ఉదయం 9.35 గంటల సమయంలో రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని నవీన్ నివాస్ నుంచి బిజూ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ నుంచి ప్రత్యేక హెలిప్యాడ్‌లో సొంత నియోజకవర్గం హింజిలికాట్‌లోని శంకర్ కంటి ఆస్పత్రి మైదానంలో దిగుతారు. అక్కడ నుంచి ప్రత్యేక వాహనంలో హింజిలికాట్ జంక్షన్‌కు చేరుకొని తన తండ్రి దివంగత బిజు పట్నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. అక్కడ నుంచి తిరిగి శంకర్ కంటి ఆస్పత్రి మైదానానికి చేరుకొని హెలీప్యాడ్‌లో సరగడా చేరుకుంటారు. అక్కడ తలపెట్టిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి తిరిగి భువనేశ్వర్‌కు పయనమవుతారు.

తప్పతాగి భార్య, కూతురిపై దాడి



గాయాలతో చిన్నబాబు కద్రక



గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కవిత, కుమారీలు

రాయగడ: తప్పతాగిన మైకంలో భార్య, కూతురిపై ఒక వ్యక్తి ఇనుప రాడ్డుతో దాడిచేసిన ఘటన జిల్లాలోని చందిలి పోలీసుస్టేషన్ పరిధి బెట్టిగుడ గ్రామం అరవింద్ నగర్ కాలనీలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ దాడిలో తీవ్రగాయాలకు గురైన తల్లీ, కూతురుని కాలనీ వాసులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కూతురి ఆరోగ్య పరిస్థితి సక్రమంగా ఉన్నప్పటికీ, తల్లి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కొరాపుట్ తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. అరవింద్‌నగర్‌లో నివాసముంటున్న చిన్నబాబు క్రడక మంగళవారం రాత్రి తప్పతాగి ఇంటికి వచ్చాడు. డబ్బులు ఇవ్వమని భార్య కుమారి కద్రకతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య గొడవ ప్రారంభమైంది. దీంతో కోపొద్రేక్తుడైన చిన్నబాబు పక్కనే ఉన్నటువంటి ఇనుప రాడ్డుతో భార్యపై దాడి చేశాడు. అదే సమయంలో అడ్డుగా వచ్చిన పదేళ్ల కూతురు కవిత కద్రకపై సైతం దాడి చేసి గాయపరిచాడు. ఇది గమనించిన భార్య కుమారి భర్త ఆరాచకత్వంపై తిరగబడింది. అనంతరం అదే రాడ్డుతో భర్త తలపై గాయపరిచింది. ఇదంతా తెలుసుకున్న కాలనీ వాసులు పరుగున వారి ఇంటికి వెళ్లి గాయపడిన కవిత, కుమారి, చిన్నబాబులను ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త హత్య కేసులో భార్య అరెస్టు



అరెస్టైన నిందితురాలు బొడైయ్ కొంద

జయపురం: భర్తను హత్య చేసిందన్న నేరంపై ఒక మహిళను జయపురం సదర్ పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. అరెస్టైన మహిళ జయపురం సమితి బరిణిపుట్ గ్రామ పంచాయతీ దేవుగుడ గ్రామానికి చెందిన బొడైయ్ కొంద(35)గా పేర్కొన్నారు. అరెస్టైన ఆమెను కోర్టులో హాజరుపర్చగా బెయిలు మంజూరు కాకపోవడంతో జైలుకు పంపినట్లు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 18వ తేదీన దువుగుడ గ్రామంలో చైత్రపర్వ్ జరుగుతున్న సమయంలో బొడైయ్, ఆమె భర్త మధ్య ఏదో కారణంతో గొడవ జరిగింది. దీంతో ఆగ్రహించిన ఆమె ఒక కర్రతో భర్త గోధాపై అమానుషంగా దాడి చేసింది. దెబ్బలకు అతడు సొమ్మసిల్లి పడిపోయాడు. అతడి పరిస్థితి విషమంగా మారడంతో 20వ తేదీన జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కొరాపుట్ సాహిద్ లక్ష్మణ్ నాయిక్ వైద్య కళాశాల ఆస్పత్రికి తీసుకెళ్లమని డాక్టర్లు సూచించారు. కానీ కుటుంబ సభ్యులు కొరాపుట్ ఆస్పత్రికి తీసుకెళ్లకుండా ఇంటికి తీసుకెళ్లడంతో, ఇంటి వద్ద అతడు మరణించాడు. పోలీసులకు విషయం తెలియడంతో మృతదేహాన్ని స్వాధీన చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. బొడైయ్ తీవ్రంగా కొట్టడం వలనే గోధా మరణించినట్లు బంధువులు ఫిర్యాదు చేయడంతో నిందితురాలిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

అవయవ దానం అత్యున్నత దానం



అవయవదానం కోసం నిర్ణయం తీసుకున్న బిశాయి దంపతులు

జయపురం: అన్ని దానాల్లో కంటే అవయవదానం అత్యున్నత దానమని జయపురం సబ్ డివిజన్ కుంద్ర సమితి కుంద్ర గ్రామానికి చెందిన సనాతన బిశాయి, అతడి భార్య బవుళ బిశాయిలు పేర్కొన్నారు. ఈ మేరకు అవయవదానానికి ముందుకొచ్చారు. అందుకోసం ప్రభుత్వ అధికారులకు దరఖాస్తులు పెట్టుకున్నారు. ఒడిశా మో పరిబార్ అన్ని ఏర్పాట్లు చేస్తుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది. అవయవాల దానంపై ఒడిశా మో పరిబార్ కొరాపుట్ జిల్లా కో–ఆర్డినేటర్ వైకృష్ణ మండల్ వివరించారు. వారు మరణించిన తర్వాత ఒడిశా మో పరివార్ అవయవాల దానంలో ప్రధాన భూమిక నిర్వహిస్తుంది. ఎవరు మరణించినా వారిని సమాధి చేయడమో, లేక దహనం చేయడమో జరుగుతుందన్నారు. అందువలన ఆ శరీరం మట్టి పాలు అవుతుందే తప్ప ఎవరికీ ఉపయోగపడదు. అందువలన మరణించిన తర్వాత అవయవాలు ఇతరులకు వినియోగిస్తే వారికి కొత్త జీవితం ఏర్పడుతుందని వెల్లడించారు. అవయవదానంపై భార్యాభర్తలతో మాట్లాడగా వారు అంగీకరించారని పేర్కొన్నారు. ఇలా అవయవదానానికి ముందుకు రావడం కొరాపుట్ జిల్లాలో ఇదే ప్రథమం అన్నారు.

ఎమ్మెల్యే మొకిమ్‌కు బెయిల్

- ఎన్నికల్లో పోటీకి అర్హతపై ఉత్కంఠ



మహ్మద్ మొకీం

భువనేశ్వర్: ఒరిస్సా రూరల్ హౌసింగ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఓఆర్‌హెచ్‌డీసీ) రుణ మోసం కేసులో బారాబటి – కటక్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే మహ్మద్ మొకీమ్‌కు మంగళవారం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే రాష్ట్రంలో త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడానికి సుప్రీంకోర్టు మంజూరు చేసిన బెయిలు అనుమతిస్తుందా లేదా అనే అంశంపై పలు వర్గాల్లో చర్చ జోరందుకుంది. ఉభయ పక్షాల వాదనలు విన్న తర్వాత స్పెషల్ లీవ్ పిటిషన్ పరిష్కారమయ్యే వరకు కోర్టు అతని శిక్షను తాత్కాలికంగా నిలిపివేసినట్లు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపంకర్ దత్తతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఆదేశించింది. గ్రామీణ గృహ నిర్మాణ రుణ కుంభకోణం వ్యవహారంలో 2022 సెప్టెంబర్ నెలలో ప్రత్యేక విజిలెన్స్ కోర్టు మహ్మద్ మొకీమ్‌కు 3 ఏళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పుపై మొకీమ్ ఒరిస్సా హైకోర్టుని ఆశ్రయించి 2 మంది పూచీకత్తులతో రూ.1 లక్ష బెయిల్ బాండ్‌పై మధ్యంతర బెయిల్ పొందారు. తదుపరి దశ విచారణ పురస్కరించుకుని ఒరిస్సా హైకోర్టు మొకీమ్ వ్యతిరేకంగా జారీ అయిన నేరాన్ని సమర్థించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించి బెయిలు కోసం అభ్యర్థించారు. ఈ పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు స్వీకరించి కేసుకు సంబంధించి ప్రతివాది ఒడిశా విజిలెన్స్‌కు నోటీసు జారీ చేసింది. ప్రాథమిక విచారణలో హైకోర్టు నిర్ణయాన్ని నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



పార్టీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బాహిణీపతి

జయపురం:

పట్టణంలోని పలు వార్డుల నుంచి వందలాది మంది బీజేడీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో మంగళవారం చేరారు. స్థానిక ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి నివాసంలో నిర్వహించిన మిశ్రణ పర్వ్ కార్యమంలో భారీగా చేరికలు జరిగాయి. కాంగ్రెస్‌లో చేరినవారికి ఎమ్మెల్యే తారాప్రసాద్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరినవారు మాట్లాడుతూ.. జయపురం ఎమ్మెల్యేగా తారాప్రసాద్ గెలిచిన తర్వాత నియోజకవర్గంలో గూండాయిజం కనుమరుగైందని, చందాల వసూళ్లు బంద్ అయ్యాయని, వ్యాపారులు నిర్భయంగా వ్యాపారాలు చేసుకోగలుగుతున్నారని, ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కృషితో జిల్లాకేంద్ర ఆస్పత్రి ఏర్పడిందని, క్రీడా క్లబ్ నెలకొందని, విక్రమదేవ్ విశ్వ విద్యాలయం వచ్చిందని, సైన్స్ పార్క్ తదితర అభివృద్ధి పనులు జరిగాయని పేర్కొన్నారు. అందువలన ఆయనకు అండగా ఉండాలనే ఉద్దేశంతో కాంగ్రెస్‌లో చేరామని వెల్లడించారు. బాహిణీపతి అత్యధిక ఓట్లతో హ్యాట్రిక్ విజయం సాధించేందుకు పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ సాధారణ కార్యదర్శి మీనాక్షి బాహిణీపతి, మున్సిపల్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేంద్ర కుమార్ మహంతి, జయపురం కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు దేవేంద్ర బాహిణీపతి, జిల్లా కాంగ్రెస్ మీడియా సెల్ అధ్యక్షుడు సుకాంత పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే బాహిణీపతి తదితరులు

6 జిల్లాల్లో ఎన్నికలపై సమీక్ష

భువనేశ్వర్:

రాష్ట్రంలో ఎన్నికలు జయప్రదం చేసేందుకు రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం అన్ని ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) నికుంజ్ బిహారీ ధొలా 6 జిల్లాల్లో జంట ఎన్నికల సన్నాహాలపై కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లతో సమీక్షించారు. సమావేశంలో ఖుర్దా, పూరీ, కటక్, నయాగఢ్, జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా జిల్లాల అధికారులను ఉద్దేశించి సీఈవో ధొలా మాట్లాడుతూ దేశంలో పండగలా నిర్వహించబడుతున్న సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎన్నికల అధికారులైన కలెక్టర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల సన్నాహాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రదర్శించారు. అదే విధంగా పోలీసు సూపరింటెండెంట్లు తమ జిల్లాల్లో శాంతిభద్రతలు, తనిఖీలు, అనధికారిక సామగ్రి, నగదు వగైరా స్వాధీనంపై సన్నాహాలను ప్రదర్శించారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సన్నాహాల్లోని వివిధ అంశాలపై సీఈవో సవివరంగా చర్చించారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, ఎస్పీలు, సీనియర్ పోలీసు అధికారులు, రిటర్నింగ్ అధికారులను బూత్ స్థాయిలో ఫూల్ ప్రూఫ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సరిపడా తాగు నీరు, మహిళలకు, పురుషులకు వేర్వేరుగా మరుగుదొడ్లు, ఓటు కోసం బారులు తీరే ఓటర్లకు ఏర్పాట్లు, స్టాల్స్, వేచి ఉండే గదులతో పాటు ఓటర్ల కోసం ఫ్యాన్లు వంటి మౌలిక సదుపాయాల్లో ఏమాత్రం లోటు లేకుండా ఏర్పాటు చేయాలని తెలిపారు. నిరంతర విద్యుత్ వ్యవస్థ కొనసాగించాలని ఆదేశించారు.



జిల్లాస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఈవో ధొలా

క్లుప్తంగా

రామకృష్ణకు ఎక్స్‌లెన్స్ అవార్డు



రామకృష్ణను అభినందిస్తున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.రామకృష్ణ భారత్ ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో బ్రెయిన్ ఓ విజన్ సంస్థ ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును బోధన రంగంలో అందించిన సేవలకు గాను అందజేశారు. పరిశోధన పత్రం, పరిశోధనల ఆధారంగా అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వర్సిటీలో మంగళవారం రామకృష్ణను వీసీ కె.ఆర్.రజిని అభినందించారు.

వెయ్యి లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



స్వాధీనం చేసుకున్న తయారీ సామగ్రితో సిబ్బంది

మెళియాపుట్టి: మండలంలోని వెంకటాపురం సచివాలయం పరిధిలోని హడ్డివాడ గిరిజన గ్రామంలో బెల్లం ఊట ధ్వంసం చేశారు. టెక్కలి సీఐ రాజశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో డీటీఎఫ్, ఎస్‌ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు సంయుక్తంగా మంగళవారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. శ్రీకాకుళం ఎస్‌ఈబీ జేడీ గంగాధరం ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు సిబ్బంది తెలిపారు. 1000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేయగా.. 80 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దాడుల్లో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.


విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన సామగ్రి

సారవకోట: మండలంలోని కూర్మనాధపురం పంచాయతీ బంజీరుపేటలో మెట్ట కస్తూరికి చెందిన ఇల్లు మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. వీఆర్వో అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. కస్తూరి మంగళవారం పాతపట్నం మండలం మెట్టపేట గ్రామానికి వివాహ వేడుకకు వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో వస్తువులు, ఆధార్, రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు, అర తులం బంగారం కాలిపోయింది. స్థానికులు గుర్తించి మంటలు అదుపు చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు విజ్ఞప్తి చేశారు.

మూడున్నర ఎకరాల్లో కట్టె జనుము దగ్ధం



కాలిపోయిన పంట

నరసన్నపేట: మండలంలోని బడ్డవానిపేటలో పండి కృష్ణారావుకు చెందిన 3.5 ఎకరాల విస్తీర్ణంలో పండించిన కట్టె జనుము పంట మంగళవారం కాలిపోయింది. కోత దశకు వచ్చిన సమయంలో పంట అగ్నికి ఆహుతి కావడం సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని రైతు కృష్ణారావు తెలిపారు.

తాగునీటి సరఫరాకు సమగ్ర ప్రణాళిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రస్తుత వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా పటిష్ట ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్ రెడ్డి రాష్ట్ర సెక్రటేరియట్ నుంచి తాగునీరు, ఉపాధి, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంచినీటి సరఫరాలో తలెత్తే ఇబ్బందులను 24 గంటల్లో పరిష్కరిస్తున్నామని చెప్పారు. సమావేశంలో జెడ్పీ సీఈవో డి.వెంకటేశ్వరరావు, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎల్.సి.హెచ్.పాత్రుడు, డీపీవో వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ చిట్టిరాజు, వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమలరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఇంజినీర్ పొగిరి సుగుణాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ జాన్ బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

జోరందుకుంటున్న ప్రచారం



శంఖం గుర్తుకే రెండు ఓట్లు నినాదంతో నవీన్ ప్రచారం

- నేటి నుంచి ప్రచార రంగంలోకి సీఎం నవీన్
- 25న రాష్ట్రంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటన
- విజయమే ధ్యేయంగా అగ్ర నాయకుల కసరత్తు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం ఈ వారంలో ఊపందుకోనుంది. ప్రధానంగా బిజూ జనతా దళ్, భారతీయ జనతా పార్టీల అగ్రనేతలు ప్రచారానికి రంగంలోకి దిగుతున్నారు. బీజేడీ ప్రముఖ ఆకర్షణ నవీన్ పట్నాయక్ బుధవారం నుంచి ప్రచార రంగంలోకి అడుగిడుతుండగా, మర్నాడు ఈనెల 25 నుంచి బీజేపీ అగ్రశ్రేణి నాయకుడు అమిత్ షా రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి విచ్చేయనున్నారు. రాష్ట్రంలో మే నెలలో 13, 20, 25, జూన్ 1న నాలుగు దశల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనుంది.

సొంత గెడ్డ నుంచి సీఎం ప్రచారం

రాజకీయంగా సొంత గెడ్డ అయినటువంటి గంజాం జిల్లా హింజిలి ప్రాంతం నుంచి బీజేడీ అధ్యక్షుడు, సీఎం నవీన్ పట్నాయక్ ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ఆయనకు ఈ నియోజకవర్గం కలిసొచ్చిన ప్రాంతం. రెండు వేర్వేరు నియోజకవర్గాల నుంచి గెలిపొందినా హింజిలి ప్రాతినిధ్యం నిలబెట్టుకుని మరోస్థానం విజయాన్ని త్యజించి సొంత గెడ్డపై కృతజ్ఞతని చాటుకున్న దాఖలాలు ఉన్నాయి. ఈసారి జరగనున్న సార్వత్రిక ఎన్నికల తుది ఫలితాల్లో మరోసారి ఈ పరిస్థితి పునరావృతంపై సర్వత్రా ఉత్కంఠ ఆది నుంచి నెలకొనడం విశేషం. వరుసగా 6వ సారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పాలన పగ్గాలు చేపట్టాలనే బలమైన దృక్పథంతో నవీన్ పట్నాయక్ ప్రచార రంగంలో గెలుపు కోసం శంఖారావం చేయనున్నారు. ఈ సందర్భంగా హింజిలి మరియు సెరాగాడా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే బహిరంగ సభల్లో ఓటర్లని ఉద్దేశించి ప్రసంగిస్తారు.

2 స్థానాల నుంచి పోటీ

ఈసారి జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ 2 వేర్వేరు స్థానాల నుంచి శాసనసభకు పోటీ చేయనున్నారు. సొంత జిల్లా గంజాం హింజిలి, పశ్చిమ ఒడిశా బొలంగీర్ జిల్లా కంటాబంజి నియోజకవర్గాల నుంచి ఆయన అభ్యర్థిత్వం ఖరారైంది. సొంత గెడ్డకు ప్రాధాన్యత నిస్తూ రాష్ట్రంలో బలహీన ప్రాంతాల్లో బీజేడీ ప్రాతినిధ్యం బలోపేతం చేసే వ్యూహంతో నవీన్ 2 నియోజకవర్గాల్లో పోటీకి నిలబడుతున్నారు. గత ఎన్నికల్లో ఇదే ప్రాతిపదికన 2 చోట్ల నుంచి పోటీ చేసి విజేతగా నిలిచారు. కాగా పశ్చిమ ఒడిశాలో భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ ఆధిపత్యం సాగుతోంది. క్రమంగా పశ్చిమ ఒడిశాని కైవసం చేసుకునే దిశలో బీజేడీ అధినేతగా నవీన్ పట్నాయక్ నడుం బిగించి ప్రత్యక్ష పోరుకు తలపడుతుండడం నాయకత్వ లక్షణాలకు అద్దం పడుతోంది. పశ్చిమ ఒడిశాలో బొలంగీర్ జిల్లా కీలకం. ఈ ప్రాంతంలోని కంటాబంజి నియోజకవర్గం బీజేడీ ఖాతాలో చేర్చుకునే దృఢ సంకల్పంతో నవీన్ ప్రత్యక్షంగా పోటీ చేస్తు హింజిలి నుంచి ప్రచారానికి శ్రీకారం చుట్టడం రాజకీయ ఆత్మీయత వ్యూహ రచనగా స్పష్టం అవుతోంది. హింజిలి ఓటర్ల మద్దతు ఏమాత్రం చెక్కుచెదిరి పోకుండా కంటాబంజి నుంచి బలంగా పోటీ చేయాలనేది నవీన్ ప్రయత్నం.



కొత్త లుక్‌లో సీఎం నవీన్ పట్నాయక్

కాంగ్రెస్ కంచుకోట

రాష్ట్రంలో కంటాబంజి కాంగ్రెసు కంచుకోటగా చలామణి అవుతోంది. గత 3 ఎన్నికల్లో కాంగ్రెస్ వరుసగా రెండు ఎన్నికల్లో విజేతగా నిలిచింది. 2009, 2019 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెసు అభ్యర్థి సంతోష్ సింగ్ సలూజా ఈ స్థానం నుంచి గెలిపొందారు. మధ్యలో 2014 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థి ఆయుబ్ ఖాన్ గెలుపొందారు. అయితే 3,868 ఓట్ల స్వల్ప తేడాతో గెలిపొందడంతో తదుపరి 2019లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెసు ప్రభంజనం ప్రజాదరణ నోచుకోగలిగింది. ఈసారి ఆ పరిస్థితి పునరావృతం కాకుండా బీజేడీ అధినేత రంగంలోకి దిగినట్లు తెలుస్తుంది.

అమీతుమీ

బొలంగీర్ జిల్లాలో 5 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్, బిజూ జనతా దళ్ చెరో 2 స్థానాలను గెలుచుకున్నాయి. బొలంగీర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి నరసింహా మిశ్రా, కంటాబంజి నుంచి సంతోష్ సింగ్ సలూజా గెలుపొందారు. అలాగే బీజేడీ టిట్లాగడ్, పట్నాగడ్ 2 స్థానాలను గెలుచుకుంది. మిగిలిన ఒక్క స్థానం లొయిసింగ బీజేపీ సొంతం చేసుకుంది. ఈ జిల్లాలో బొలంగీర్ లోక్‌సభ స్థానంలో బీజేపీకి చెందిన సంగీతా కుమారి సింగ్ దేవ్ విజయం సాధించారు. ఈసారి కంటాబంజి స్థానం బీజేడీ ఖాతాలో చేర్చుకుని పశ్చిమ ఒడిశా బొలంగీర్ జిల్లాలో ఉనికిని బలోపేతం చేసేందుకు నవీన్ తొడగొడుతున్నారు.

శంఖానికే 2 ఓట్లు

శంఖం గుర్తుకు 2 ఓట్లు బీజేడీ సరికొత్త నినాదం. ఒక ఓటు రాష్ట్ర శాసనసభకు, మరొకటి లోక్‌సభ కోసమని నవీన్ పట్నాయక్ పిలుపునిస్తున్నారు. కేంద్రంలో మోదీ డబుల్ ఇంజిన్ సర్కారు నినాదానికి సరాసరి సవాల్ విసురుతూ నవీన్ సరికొత్త నినాదం ఆవిష్కరించడం చమత్కారం. ఈ నినాదంతో బొలంగీర్ జిల్లా సరిహద్దు కలహండి, బౌధ్, సువర్ణపూర్, నువాపడా, బర్‌గడ్ జిల్లాల్లో బీజేడీ సామ్రాజ్యం విస్తరణ లక్ష్యం. కంటాబంజి నుంచి ముఖ్యమంత్రి పోటీ పరిసరాల్లో 4 లోక్‌సభ స్థానాలపై ప్రభావం చూపుతుంది. బొలంగీర్, బర్‌గడ్, కలహండి, కంధమల్ పార్లమెంటరీ నియోజకవర్గాలు, వీటి పరిధిలో 28 అసెంబ్లీ సెగ్మెంట్లు అనుసంధానంతో ఈసారి నవీన్ పట్నాయక్ పశ్చిమ ఒడిశా ప్రచార పర్యటన రోడ్డు మ్యాప్ రూపుదిద్దుకుంటోంది. 2019 ఎన్నికల్లో బొలంగీర్, బర్‌గడ్, కలహండి లోక్‌సభ స్థానాలను బీజేడీ కోల్పోయింది. ఈసారి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ శంఖం గుర్తుకు 2 ఓట్లు ప్రచారంతో ఈ 3 లోక్‌సభ స్థానాల కైవసం ఆశయ సిద్ధికి ప్రాణం పోస్తుందని భావిస్తున్నారు.

ప్రతికూలత నుంచి పట్టు సాధన

హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా సరికొత్త రికార్డు ఆవిష్కర్త సంకల్పంతో పోటీ చేస్తున్న నవీన్ పట్నాయక్ శాసనసభలో బలంతో పాటు రాష్ట్రం అంతగా బీజేడీ విస్తరణకు నిరంతర ఉద్యమం కొనసాగిస్తున్నారు. ప్రతికూల ప్రాంతాల్లో పరిస్థితులను చక్కదిద్ది బలోపతం చేయడంలో ఆయనకు సాటి ఎవరు లేరని నిరూపించుకుంటున్నారు. కంటాబంజి నియోజకవర్గం ఈ కోవకు చెందినదే. ఈ స్థానంలో గెలుపు పశ్చిమ ఒడిశా అంతటా బీజేడీ నాయకులు, కార్యకర్తల్లో మనోధైర్యాన్ని ప్రేరేపించి సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుందని భావిస్తున్నారు.

బీజేడీతో బీజేపీ ఢీ

రాష్ట్రంలో నవీన్ సర్కారుని గద్దె దించే పోరుతో బీజేపీ గత ఎన్నికల నుంచి హోరాహోరీగా పోరాడుతుంది. పశ్చిమ ఒడిశాలో అంతంతమాత్రం బలం కలిగిన బీజేడీని ఈ ప్రాంతం నుంచి కుప్పకూల్చాలనే యోచనతో బీజేపీ ఆది నుంచి ఆచితూచి అడుగు వేస్తోంది. ఈ దిశలో పశ్చిమ ఒడిశా బొలంగీర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని సోన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా గురువారం ఏప్రిల్ 25న బీజేపీ ఎన్నికల ప్రచారం హోరెత్తించేందుకు విచ్చేస్తున్నట్లు సమాచారం. మే 20న ఈ ప్రాంతంలో పోలింగ్ జరుగుతుంది. బొలంగీరు లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా సంగీత కుమారి సింగ్‌దేవ్ బరిలో ఉన్నారు. ఆమె గెలుపు బీజేపీకి ప్రతిష్టాత్మకం.

'బీజేడీ విజయానికి కృషి చేయాలి'



ప్రసంగిస్తున్న ప్రణబ్ ప్రకాష్ దాస్

మల్కన్‌గిరి: జిల్లాలోని అన్ని స్థానాల్లో బీజేడీ విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రణబ్ ప్రకాష్ దాస్ సూచించారు. జిల్లా కేంద్రంలోని బీజేడీ కార్యాలయంలో చిత్రకొండ, మల్కన్‌గిరి నియోజకవర్గాల ఎమ్మెల్యే అభ్యర్థులు మానస్ మద్కామి, లక్ష్మీప్రియ నాయిక్‌లతో పాటు నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు ప్రతీ పథకాన్ని ఇక్కడ నుంచే ప్రారంభించినట్లు గుర్తు చేశారు. నాయకులు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

సమావేశంలో కొరాపుట్ జిల్లా బీజేడీ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి, నాయకులు ప్రభాకర్ ప్రధాన్, దుర్గప్రసాద్ త్రిపాఠి, గోపాలపండ, మల్కన్‌గిరి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కవితామోహంతి తదితరులు పాల్గొన్నారు.

పద్మ పురస్కారాలు ప్రదానం



పద్మశ్రీ పురస్కారం అందుకుంటున్న గురు గోపీనాథ్ స్వయిం



పురస్కారం అందుకుంటున్న కవి బినోద్ కుమార్ పసాయత్

భువనేశ్వర్: రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రముఖులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారాలు మంగళవారం ప్రదానం చేశారు. వీరిలో 106 ఏళ్ల గురు గోపీనాథ్ స్వయిం ఒకరు. ఈయన పురాణ కథకుడు మరియు కృష్ణ లీల గురువుగా గుర్తింపు పొందారు. ఈ రంగంలో ఆయన గత తొమ్మిది దశాబ్దాలుగా సంప్రదాయ కళారూపాల ప్రోత్సాహానికి చేసిన కృషి అనన్యంగా నిలిచింది. అదేవిధంగా రాష్ట్రానికి చెందిన ప్రముఖ కవి బినోద్ కుమార్ పసాయత్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. ఆయన తన రచనల ద్వారా సంబల్‌పురి, కోస్లీ సాహిత్యాన్ని సుసంపన్నం చేయడంలో నిరంతర కృషి కొనసాగిస్తూ గుర్తింపు పొందారు.

కాంగ్రెస్ శ్రేణుల భారీ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బిజయ పట్నాయక్ తదితరులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా పర్లాకిమిడి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న బిజయ పట్నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని సొండివీధిలో కాంగ్రెస్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో బరంపురం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రస్మిరంజన్ పట్నాయిక్, డీసీసీ అధ్యక్షుడు, మోహన నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దాశరథి గొమాంగో, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బసంతపండా తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

బీజేపీ స్టార్ క్యాంపెయినర్ల ప్రకటన

భువనేశ్వర్: రాష్ట్రంలో జంట ఎన్నికల కోసం ప్రచారానికి భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అగ్రశ్రేణి నాయకులు రాష్ట్రానికి విచ్చేయనున్నారు. దీనిలో భాగంగా బీజేపీ స్టార్ క్యాంపెయినర్ల జాబితాను మంగళవారం ప్రకటించింది. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ), ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో)కి రాసిన లేఖలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేయనున్న 40 మంది నేతల వివరాలను తెలియజేశారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థుల కోసం ప్రచార బృందం విచ్చేస్తుంది. ఈ జాబితాలో పలువురు కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులు, సీనియర్ నేతలు ఉన్నారు. కేంద్రమంత్రుల్లో రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, అశ్విని వైష్ణవ్, స్మృతి ఇరానీ, జ్యోతిరాదిత్య సింధియా, ధర్మేంద్ర ప్రధాన్, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థుల కోసం ప్రచారం చేయనున్నారు. వీరితో పాటు రాష్ట్రానికి చెందిన ప్రముఖులతో జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డాతో సహా పలువురు సీనియర్ నాయకులు ప్రచార కార్యక్రమాల్లో పాలుపంచుకుంటారు.

శ్రీమందిరంలో రక్తపు బొట్టు

- మూల విరాటులకు మహాస్నానం

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని శ్రీమందిరంలో దర్శనానికి విచ్చేసిన భక్తుల చేతి వేలు నుంచి రక్తం కారింది. దీంతో ఆలయ ఆచారాల ప్రకారం తదుపరి సేవలు తక్షణమే నిలిపివేశారు. అనంతరం శుద్ధి ప్రక్రియలో భాగంగా మూల విరాటులకు మహాస్నానం చేయించారు. శ్రీమందిరం భిత్తారా కథా (లోపలి ప్రాంగణం) పరిసరాల్లో రక్తపు బొట్టు పడినట్లు దృష్టికి వచ్చింది. మంగళవారం ఉదయం సేవాయత్‌ల భార్యలు దర్శనం కోసం ఆలయంలోనికి ప్రవేశిస్తున్న సమయంలో చేతివేలి నుంచి రక్తపు బొట్టు రాలినట్లు గమనించారు. ఈ నేపథ్యంలో మంగళ హారతి ముందే ఆలయ శుద్ధి, మహా స్నానం ప్రక్రియలు ముగించి తదుపరి సేవలు యథాతథంగా కొనసాగించారు. దైనందిన సేవాదుల్లో స్వల్ప జాప్యం చోటు చేసుకుంది.

చెరువులో యువకుడి మృతదేహం లభ్యం



చెరువులో తేలుతున్న యువకుడి మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి ఎంవీ 79 పోలీసుస్టేషన్ పరిధి తీగాల్ గ్రామంలోని చెరువులో ఒక యువకుడి మృతదేహం మంగళవారం ఉదయం తేలుతూ కనిపించింది. దీంతో స్థానికులు వెంటనే ఎంవీ 79 పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి వారు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే మృతదేహాన్ని పరిశీలించిన గ్రామస్తులు రెండు రోజులుగా కనిపించని తమ గ్రామానికి చెందిన సురేష్ అనే యువకుడిది అని గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు దిగ్భ్రాంతి చెందారు. పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భగ్గుమంటున్న భానుడు

బరంపురం:

గంజాం జిల్లాలో రోజురోజుకీ ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచే భానుడు ప్రభావం చూపిస్తుండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకే ఎండ వేడి తీవ్రత విపరీతంగా పెరిగింది. దీంతో రోడ్లపై సంచారం లేక నగరం కర్ఫ్యూని తలపించింది. ఎండ వేడిమి నుంచి ఉపశమనానికి శీతల పానియాలపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. కాగా ఏప్రిల్‌లోనే ఎండలు మండిపోతుంటే, మే నెలలో ఇంకెలా ఉంటాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న వడదెబ్బ తీవ్రత

భువనేశ్వర్: రాష్ట్రమంతటా గత కొద్ది రోజులుగా వేడి గాలులు వీస్తుండడంతో వడదెబ్బ తీవ్రతరమవుతోంది. 16 జిల్లాల్లో వడదెబ్బ, వేడిమి సంబంధిత అనారోగ్యం కేసులు నమోదైనట్లు ప్రజారోగ్య శాఖ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్ మిశ్రా మీడియాకు మంగళవారం తెలిపారు. బాధితులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు.

ఒకరు మృతి

ఈ సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రంలో ఒకరు వడదెబ్బకు గురై మృతి చెందారని డాక్టర్ నిరంజన్ మిశ్రా తెలిపారు. ఇతర మరణాల గురించి మీడియా నివేదికలు ఆరోగ్య శాఖ ధ్రువీకరించలేదని స్పష్టం చేశారు. సుందర్‌గడ్‌లో అత్యధికంగా 41, ఖుర్దాలో 12, అంగుల్‌లో 9, మయూర్‌భంజ్, ఝార్సుగుడలో 7 మంది చొప్పున, సంబల్‌పూర్‌లో 5 వడదెబ్బ సంబంధిత కేసులు నమోదయ్యాయని వెల్లడించారు.

ముగిసిన ఆదిత్యుని కల్యాణోత్సవాలు



చక్రతీర్థ స్నానాల తర్వాత స్వామివారి మూర్తులను తీసుకొస్తున్న శంకరశర్మ బృందం

- ఘనంగా చక్రతీర్థ స్నానాలు, పుష్పయాగం

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ నెల 15 నుంచి ఉత్సవాలు ప్రారంభం కాగా చివరి రోజు రాత్రి పుష్పయాగం, ఏకాంతసేవలు ఘనంగా నిర్వహించారు. చైత్ర శుద్ధ పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆలయ ఇంద్రపుష్కరిణి ఆవరణలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో కల్యాణమూర్తులకు సుమంగళి అర్చన, నీలమణి ధారణ, నాకబలి ప్రయుక్త చక్రతీర్థ స్నానాలను చేయించారు. అనంతరం వేదమంత్రాలు, మంగళధ్వనుల మధ్య ఆలయంలోకి కల్యాణమూర్తులను తీసుకొచ్చి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం కల్యాణోత్సవాలను ముగిస్తూ ధ్వజావరోహణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈవో ఎస్.చంద్రశేఖర్, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగం..

ముగింపు ప్రక్రియలో భాగంగా స్వామివారి పుష్పయాగ మహోత్సవం అనివెట్టి మండపంలో నిర్వహించారు. సుమారు 12 రకాల పుష్పాలతో స్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలతో కూడిన ఏకాంతసేవ ఘనంగా నిర్వహించారు.



అనివెట్టి మండపంలో పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

డాక్టర్ తలే రాజేష్‌కి వైఎస్సార్‌సీపీ బీ ఫామ్



రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా బీ-ఫామ్ అందుకుంటున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ పార్టీ అధిష్ఠానం నుంచి బీ-ఫామ్ అందుకున్నారు. మంగళవారం విశాఖపట్నంలో పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా ఈ ఫామ్‌ను అందుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అత్యధిక ఓట్లతో రాజాం ఎమ్మెల్యేగా గెలవాలని రీజనల్ కోఆర్డినేటర్ తనను ఆశీర్వదించారని డాక్టర్ రాజేష్ ఇక్కడ మీడియాకు తెలిపారు.

మే 13న వేతనంతో కూడిన సెలవు

విజయనగరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13న జరిగే పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవు ప్రకటించినట్టు జిల్లా ఉప కార్మిక కమిషనర్ ఎన్.సుబ్రహ్మణ్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాదా దుకాణాలు, సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా సెలవు ప్రకటించినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు దుకాణదారులు, వివిధ సంస్థల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

జీడి తోటలో కార్చిచ్చు

శృంగవరపుకోట: మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధిలో లచ్చన్నదొరపాలెం జీడితోటల్లో రేగిన కార్చిచ్చుతో 20 ఎకరాల్లో జీడిమామిడి తోటలు కాలిపోయాయి. మధ్యాహ్న సమయంలో గాలులు వీయటం, ఎండ తీవ్రంగా ఉండటంతో మంటలు శరవేగంగా వ్యాపించాయి. మంటలు ఆర్పేందుకు దగ్గరలో ఎటువంటి నీటి వసతి లేకపోవటంతో కళ్ల ముందు తోటలు కాలుతున్నా ఏమీ చేయలేకపోయారు. ఎస్.కోట అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ఎన్ని దఫాలు ఫోన్ చేసినా వెహికల్ వేపాడలో ఉంది, కొత్తవలసలో ఉందని చెప్పారు తప్ప వెహికల్ రాలేదని గిరిజన రైతులు వాపోయారు. నష్టపోయినా రైతుల్ని ఆదుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు డిమాండ్ చేశారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు

విజయనగరం క్రైమ్: పోక్సో కేసులో నిందితునికి ఏడేళ్ల జైలుశిక్షతో పాటూ రూ.2,500 జరిమానా విధిస్తూ విజయనగరం పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పు వెల్లడించారని దిశా మహిళా పోలీసుస్టేషన్ ఇన్‌చార్జి డీఎస్పీ డి.విశ్వనాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూసపాటిరేగ మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన గొర్లె రాంబాబు 2021 జూలై 5న ఒక ఇంట్లోకి చొరబడి మైనరు బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు దిశా మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి మహిళా ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి, నిందితుడ్ని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారన్నారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ ప్రారంభం నుంచి దిశా పోలీసులు సాక్ష్యులను, ఆధారాలను ప్రవేశపెట్టడంతో నిందితునిపై నేరారోపణలు, రుజువుకావడంతో పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి కె.నాగమణి నిందితుడు గొర్లె రాంబాబుకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు. కేసులో నిందితుడిపై నేరం నిరూపణయ్యే విధంగా పోలీసుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మావూరి శంకరరావు వాదనలు వినిపించగా, దిశా ఇన్‌చార్జి డీఎస్పీ డి.విశ్వనాథ్, సీఐ బి.నాగేశ్వరరావు, పర్యవేక్షణలో దిశా పోలీసుస్టేషన్ కోర్టు హెచ్‌సి శ్రీనివాసరావు ప్రాసిక్యూషన్‌లో సహాయ సహకారాలను అందించారన్నారు.

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన 20 గడ్డివాములు

తెర్లాం: మండలంలోని ఆమిటి గ్రామంలో వరుసగా రెండో రోజు మంగళవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 20 గడ్డివాములు, రెండు పశువుల శాలలు, 20 క్వింటాళ్ల ధాన్యం బస్తాలు కాలిపోయాయి. సోమవారం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాములు కాలిపోయిన విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన దిగువ వీధి కల్లాల్లో ఉన్న రైతులందరికి చెందిన గడ్డివాములు రెండు రోజులుగా జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమయ్యాయి. మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఈదుబిల్లి అప్పలస్వామి, ఆదినారాయణ, కరణం రమేష్, తిరుపతి తదితరులకు చెందిన గడ్డివాములు కాలిపోయాయి. ఇదే ప్రమాదంలో ఈదుబిల్లి అప్పలస్వామి, ఆదినారాయణలకు చెందిన 20 క్వింటాళ్ల ధాన్యం బస్తాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దిగువవీధికి చెందిన రైతులంతా ఏడాది పొడవునా పశువులకు మేత వేసేందుకు నిల్వ చేసుకున్న గడ్డివాములన్నీ పూర్తిగా కాలిపోవడంతో పశువులకు మేత ఏమి వేయాలో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా రెండు రోజులు అగ్ని ప్రమాదం జరిగి గడ్డివాములు దగ్ధం కావడంపై రైతులంతా ఆందోళన చెందుతున్నారు. అగ్ని ప్రమాద సమాచారాన్ని గ్రామస్తులు రాజాం అగ్నిమాపక కేంద్రానికి ఇవ్వడంతో అధికారులు, సిబ్బంది అగ్నిమాపక శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదంపై రెవెన్యూ అధికారులు వచ్చి నష్టాన్ని అంచనా వేశారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ భరోసా

- ఏపీలో మాత్రమే దీర్ఘకాలిక రోగులకు ఫించను ఇస్తున్న వైనం
- నెలకు రూ.5 వేల నుంచి రూ.10 వేలు అందజేత
- ఐదేళ్లలో రూ.50.41 కోట్లు అందజేత
- జిల్లాలో 1455 మంది లబ్ధిదారులు

విజయనగరం ఫోర్ట్: రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వేలాది మందికి దీర్ఘకాలిక వ్యాధుల పింఛన్లు అందజేస్తోంది. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రమే ప్రభుత్వం కుష్టు, ఫైలేరియా, కిడ్నీ వ్యాధులు, పక్షవాతం, మంచానికే పరిమితం అయిన వారు, సికిల్‌సెల్ ఎనిమీయా, తలసీమియా హిమోఫిలియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి ప్రభుత్వం అండగా ఉంటూ భరోసా కల్పిస్తోంది. గతంలో ఏ ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల గురించి ఆలోచించిన దాఖలాల్లేవు. దీంతో ఆయా వ్యాధులకు వైద్యం చేయించుకోవడానికి బాధితులు వేలల్లో ఖర్చు చేసేవారు. ఇటువంటి పరిస్థితి నుంచి వారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతి నెల పింఛన్ ఇస్తున్నారు. రూ.5 వేలు నుంచి రూ.10 వేలు చొప్పున ప్రతి నెల పింఛన్ అందజేస్తున్నారు.



ఈ ఫొటోలో ఉన్న ఆమె పేరు రాగోలు అచ్చప్ప. ఈమెది సంతకవిటి మండలం మొదుగులపేట గ్రామం. ఈమెకు రెండు కాళ్లకు బోధకాలు (ఫైలేరియా) సోకింది. దీంతో ఈమెకు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇచ్చే పింఛన్ మంజూరైంది. నెలకు రూ.5 వేల చొప్పన పింఛన్ ప్రభుత్వం ఇస్తుంది. ఈ డబ్బులు తనకు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఆమె సంతోషంగా ఉంది.

వ్యాధి నిర్ధారణ పత్రం ఆధారంగానే..

సంబంధిత వ్యాధి నిర్ధారణకు సంబంధించి ప్రభుత్వ ల్యాబొరేటరీ, వైద్యులు ఇచ్చిన నిర్ధారణ పత్రాన్ని పీహెచ్‌సీ వైద్యుడు పరిశీలించి డీఎంహెచ్‌ఓకు పంపిస్తారు. డీఎంహెచ్‌ఓ వాటిని పరిశీలించి మంజూరు కొరకు ప్రభుత్వానికి పంపిస్తారు. దీర్ఘకాలిక వ్యాధులతో పింఛన్లు అందుకున్న వారు జిల్లాలో 1455 మంది ఉన్నారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పింఛన్లు మాదిరి ప్రతి నెల ప్రభుత్వం పింఛన్ అందజేస్తోంది. ఒక్క కుష్టు వ్యాధిగ్రస్తులకు మాత్రమే 3 వేల పింఛన్ అందిస్తున్నారు. ఫైలేరియా (రెండు కాళ్లకు) ఉన్న వారికి రూ.5 వేలు, క్రానిక్ కిడ్నీ ఉన్న వారికి రూ.10 వేలు, కిడ్నీ, గుండె, లివర్ మార్పిడి జరిగిన వారికి రూ.5 వేలు, పక్షవాతంతో వీల్‌చైర్‌లో ఉన్న వారికి రూ.5 వేలు, హిమోఫిలియా, సికెల్‌సెల్ ఎనిమియా, తలసెమియా రోగులకు రూ.10 వేలు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడి మంచానికే పరిమితం అయిన వారికి రూ.5 వేలు ప్రభుత్వం అందిస్తోంది.





ఈ ఫొటోలో కనిపిస్తున్న బాలుడు పేరు మహంతి కూర్మారావు. బాలుడిది నెల్లిమర్ల మండలం గరికిపేట. కూర్మారావుకు నెల నెల రక్తం తగ్గిపోతుండడంతో కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలు చేయడంతో సికిల్ సెల్ ఎనిమియా అని నిర్ధారణ అయింది. ఇతనికి నెలకు రూ.10 వేలు ఫించను అందుతోంది. ఈ డబ్బులు వైద్యానికి, ఇతర ఖర్చులకు ఎంతో ఉపయోగపడుతున్నాయని సంబరపడుతున్నాడు.

దీర్ఘకాలిక పింఛన్లు అందుకుంటున్న వారి వివరాలు	
వ్యాధి రకం	పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య
ఫైలేరియా	90
క్రానిక్ కిడ్నీ వ్యాధి	418
కిడ్నీ, గుండె మార్పిడి	31
కుష్టు	307
పక్షవాతం	327
హిమోపోలియో	23
మంచానికే పరిమితం	60
సికిల్‌సెల్ ఎనిమియా	162
తలసీమియా	37

ఐదేళ్లలో రూ.50.41 కోట్లు అందించిన ప్రభుత్వం

2019 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ నిమిత్తం రూ.47.53 కోట్లు అందించింది. ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు రూ.2.70 కోట్లు, క్రానిక్ కిడ్నీ రోగులకు రూ.25.08 కోట్లు, కిడ్నీ, లివర్ మార్పిడి చేయించుకున్న వారికి రూ.93 లక్షలు, కుష్టు వ్యాధిగ్రస్తులకురూ.5.52 కోట్లు, పక్షవాతం రోగులకు రూ.9.81 కోట్లు, హిమోఫిలియో రోగులకు రూ.1.38 కోట్లు, మంచానికే పరిమితం అయిన వారికి రూ.1.80 కోట్లు, సికిల్‌సెల్ ఎనిమియా రూ.97.20 లక్షలు, తలసీమియా వారికి రూ.2.22 కోట్లు అందించారు.

నేడు డాక్టర్ తలే రాజేష్ నామినేషన్

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా..
- హాజరు కానున్న ప్రముఖులు

రాజాం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ తలే రాజేష్ రాజాం నియోజకవర్గానికి నామినేషన్ వేయనున్నారు. బుధవారం ఉదయం 11 నుంచి 1 గంట మధ్యలో నామినేషన్ దాఖలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు.

ఉదయం 9 గంటలకే..

డాక్టర్ రాజేష్ ఉదయం 9గంటలకే పార్టీ క్యాడర్‌తో కలసి బొబ్బిలిరోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి గుడికి చేరుకుంటారు. అక్కడ గుడిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రోడ్డులో ర్యాలీగా వస్తారు. ఎస్‌ఆర్ గ్రౌండ్ సమీపంలో వాహనాలు మొత్తం నిలుపుదల చేసి, పార్టీ శ్రేణులును ఉద్దేశించి మాట్లాడుతారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను ఈఆర్‌ఓకు అందజేస్తారు.

హాజరు కానున్న ప్రముఖులు

నామినేషన్ ఘట్టానికి పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిసింది. రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, విజయనగరం జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహన రావుతో పాటు జిల్లాలో పలువురు ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్‌లు, డైరెక్టర్లు వచ్చే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.



డాక్టర్ తలే రాజేష్

కొత్త వ్యక్తి నూతనోత్సాహం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసాధారణ నిర్ణయాన్ని తీసుకుంది. రాజకీయంలో సరికొత్త వ్యక్తులకు అవకాశం కల్పించే దిశగా వైద్య వృత్తి చేసుకునే డాక్టర్ రాజేష్‌ని అనూహ్యంగా తెరమీదకు తీసుకొచ్చింది. రాజకీయాలకు దూరంగా ఉండే రాజేష్‌ను ఎన్నో పార్టీలు ఆహ్వానించినా వెళ్లలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధి విధానాలకు ఆకర్షితులై ఈ పార్టీలోకి అడుగుపెట్టారు. రాజాం ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించిన తక్కువ నెలల్లోనే నియోజకవర్గంలోని ప్రతీ గ్రామాన్ని, ప్రతీ వార్డుని రెండు పర్యాయాలు పర్యటించి, ప్రతీ ఇంటి తలుపుతట్టారు. దీంతో ఈ నామినేషన్ ఘట్టానికి వేలాదిమంది అభిమానులు స్వచ్ఛందంగా వచ్చే అవకాశాలు ఉన్నాయి.

చంద్రబాబువి దిగజారుడు వ్యాఖ్యలు

- ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: చంద్రబాబువి దిగజారుడు వ్యాఖ్యలని, స్థాయికి తగ్గట్టుగా మాట్లాడకపోతే ప్రజలు ఛీకొడతారన్న విషయం తెలుసుకోవాలని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఎస్.కోటలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తవలసలో కొండను తవ్వేసి రూ.50 కోట్లతో ఇల్లు నిర్మించానని చంద్రబాబు విమర్శలు చేయడం తగదన్నారు. తన భార్య తాత 1969లో కొనుగోలు చేసిన జిరాయితీ భూమిగా పేర్కొన్నారు. రెల్లిలో 100 ఎకరాల భూమి ఎవరికో ఇచ్చేశానంటూ తప్పుడు ఆరోపణలు చేయడం విచాకరమన్నారు. 2012లో వారు భూమి కొంటే 2013లో నాలా కన్వర్షన్ అయ్యిందని, నేను 2019లో ఎమ్మెల్యేగా ఇక్కడకు వచ్చానని, ఇదికూడా చంద్రబాబుకు తెలియకపోవడం బాధాకరమన్నారు. అబద్ధాలు చెబితే దేవుడు ఊరికే వదిలిపెట్టడని, నోరు పడిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎస్.కోటలో 86 వేల కుటుంబాలకు మీరు ఏంచేస్తారో చెప్పడం మానేసి, అధికార పార్టీ నేతల్ని తిట్టడమే మీ అజెండానా అంటూ నిలదీశారు. నియోజకవర్గంలో కొందరికి సాంకేతిక కారణాల వల్ల పథకాలు అందలేదని, అవి గుర్తించామని, వారికి పథకాలు అందజేసే బాధ్యత తీసుకున్నామన్నారు. నియోజకవర్గంలో 10వేల మందికి ఇళ్లు ఇచ్చాం... మరో 5వేల మందికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. జేజేఎం కింద 270 గ్రామాల్లో ఇంటింటి తాగునీటి కుళాయిలు వేస్తున్నామని, ఇప్పటికే 90 గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని తెలిపారు. ధారపర్తి పంచాయతీ, మారిక గిరిశిఖర గ్రామాలకు రోడ్లు వేయించామని, ధారపర్తిలో భోజనం చేశానని, టీడీపీ నాయకురాలు కోళ్ల లలితకుమారి ఆమె జీవిత కాలంలో ఏనాడైనా ఆ గ్రామాలను సందర్శించిందా అని ప్రశ్నించారు. ఎస్.కోటను విశాఖలో కలిపితే ముందుగా మద్దతు తెలిపేది తనేనన్నారు. మాజీ ఎమ్మెల్యే హైమావతి మాట్లాడుతూ లలితకుమారి గురించి మేము చెప్పక్కరలేదని, ఇటీవల వాళ్ల పార్టీ లీడర్ గొంపకృష్ణ ఆవిడ చిట్టా విప్పారన్నారు. ఎస్.కోటను విజయనగరం జిల్లాలో ఉంచాలని ఎమ్మెల్యే లెటర్ ఇచ్చారని ఆరోపించారని, ఆ లెటర్ చూపిస్తే మీరు ఏం అడిగితే అది చేస్తాం... లెటర్ చూపలేక పోతే మీరు పోటీ నుంచి తప్పుకుంటారా అంటూ సవాల్ విసిరారు. అమ్మా, అక్కా, బావ అంటూ కోళ్ల లలితకుమారి ప్రజలను మోసం చేయడం తప్ప, చేసిన మేలు శూన్యమన్నారు. డీసీసీబీ చైర్మన్ వి.చినరామునాయుడు మాట్లాడుతూ తాత పేరు చెప్పుకుని ఉత్తరాపల్లిని ఉద్ధరించి, తర్వాత ఎస్.కోట వచ్చి పార్టీలో చాలామంది గొంతులు కోసేసిన లలితకుమారి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. రైవాడ నీళ్లు ఇమ్మని అడిగితే ఏనాడూ నోరు విప్పని తెలుగుదేశం పెద్దలు ఇప్పుడు పోలవరం తెస్తాం మని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్.కోట వైస్ ఎమ్పీపీ పినిశెట్టి వెంకటరమణ, పార్టీ మండలాధ్యక్షుడు మోపాడ కుమార్, సర్పంచ్‌లు మేరపురెడ్డి యామినిదేవి, కె.వెంకటరావు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

స్ట్రాంగ్‌రూమ్‌లు సిద్ధం చేయాలి

- రిసెప్షన్ సెంటర్ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద స్ట్రాంగ్ రూమ్‌లను సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాల, రిసెప్షన్ సెంటర్లలో ఏర్పాటుపై నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులతో మంగళవారం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జేఎన్‌టీయూజీవీ, లెండి కళాశాలల్లో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్లు, ఫుడ్ కోర్టులు, పార్కింగ్ ప్రాంతం, లోపలికి రాకపోకల మార్గాలు, తదితర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నిక ప్రక్రియ ముగించి ఎంతో అలసిపోయి వచ్చే సిబ్బంది ఏ మాత్రం ఇబ్బందిపడని విధంగా రిసెప్షన్ సెంటర్ వద్ద ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది ముందు రోజు సాయంత్రం 7 గంటల నుంచి రిసెప్షన్ సెంటర్‌కు చేరుకునే అవకాశం ఉందని, అప్పటికీ అక్కడ అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. వచ్చిన వారి దగ్గర నుంచి ఈవీఎంలను తీసుకుని స్ట్రాంగ్ రూముకు తరలించేందుకు సరిపడా సిబ్బందిని సిద్ధం చేయాలని సూచించారు. తగినన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలని, స్పెషల్ కౌంటర్‌లో ఈవీఎంలు, సాధారణ కౌంటర్‌లలో ఇతర ఎన్నికల సామగ్రిని స్వీకరించి, భద్రపరచాలని సూచించారు. ప్రతీ చోటా తాగునీటి సదుపాయం ఉండాలన్నారు. ప్రాంగణమంతా వెలుగు ఉండే విధంగా విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైద్యశిబిరాలను ఏర్పాటు చేసి, అవసరమైన వారికి వైద్య సహాయాన్ని అందించాలన్నారు. పరిశీలకులకు, ఆర్‌వోలకు కూడా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. వేదికల నోడల్ అధికారులు వివిధ విభాగాల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ రిసెప్షన్ సెంటర్‌లో ప్రణాళికా బద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మే 12వతేదీ నాటికే వీటి ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు. లెండికళాశాల వద్ద సుమారు 14వేల మందికి, జెఎన్‌టీయూ వద్ద సుమారు 6వేల మందికి భోజన సదుపాయం కల్పించాల్సి ఉంటుందన్నారు. సరిపడినన్ని ఫుడ్ కౌంటర్లను ఏర్పాటు చేసి, తగినంత మంది సిబ్బందితో సరఫరా చేయించాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లను సిద్ధం చేసేందుకు నిర్మాణ పనులను వెంటనే మొదలు పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. స్ట్రాంగ్ రూముల నుంచి రిసెప్షన్ సెంటర్ల వరకు మూడంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఒకసారి ఈవీఎంలు స్ట్రాంగ్ రూముల్లో పెట్టిన తరువాత అటువైపు రాకపోకలు పూర్తిగా నిలిపివేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జేసీ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్వో , ఎస్డీ అనిత, ఆర్డీవో ఎం.వి.సూర్యకళ, నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

పార్లమెంటుకు 5, అసెంబ్లీకి 16 నామినేషన్లు

విజయనగరం అర్బన్: విజయనగరం పార్లమెంట్ స్థానానికి మంగళవారం 6 నామినేషన్లు దాఖలయ్యాయని, జిల్లాలోని ఆరు అసెంబ్లీ స్థానాల నుంచి 16 నామినేషన్లు వచ్చాయని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. పార్లమెంట్ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. సమాజ్ వాదీ పార్టీ నుంచి సామిరెడ్డి అచ్చియ్యనాయుడు, బీఎస్పీ నుంచి పీరుబడి ప్రకాశరావు, స్వతంత్ర అభ్యర్థిగా పీవీఏ ఆనందసాగర్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి సఖినేటి అనంతరాజు, జై భీమారావు భారత్ పార్టీ నుంచి చిన్నం అరుణకుమారి, స్వతంత్ర అభ్యర్థిగా వేలూరి వెంకట త్రినాధరావు ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను కలెక్టర్‌కు అందజేశారు. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కందివలస సురేష్, జైభీమారావు పార్టీ తరఫున చింతపల్లి దుర్గారావు, అఖిల భారతీయ జనసంఘ్ పార్టీ నుంచి పోలిపల్లి కిరణ్‌కుమార్ ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, జేసీ కె.కార్తీక్‌కు అందజేశారు. గజపతినగరం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా జి.కూర్మినాయుడు ఒక సెట్ నామినేషన్ వేశారు. చీపురుపల్లిలో కాంగ్రెస్ పార్టీ తరపున తుమ్మగంటి సూరినాయుడు నాలుగు సెట్‌లు, స్వతంత్ర అభ్యర్థిగా గుడివాడ షణ్ముఖరావు, బీఎస్పీ నుంచి అర్జి శివప్రసాద్ ఒక్కో సెట్ నామినేషన్ వేశారు. ఎస్.కోట నియోజకవర్గంలో బీఎస్పీ తరపున బోను కృష్ణ నామినేషన్ వేశారు. రాజాం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా గండి అప్పారావు, కాంగ్రెస్ పార్టీ తరపున కంబాల రాజవర్ధన ఒక్కో సెట్ వేయగా, టీడీపీ నుంచి కోండ్రు మురళీమోహన్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. బొబ్బిలి నియోజకవర్గంలో టీడీపీ నుంచి వీఎస్‌కె.కృష్ణరంగారావు ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఆర్డీవోకు సమర్పించారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో నామినేషన్లు పడలేదు.

మలేరియా నివారణపై ప్రత్యేక దృష్టి

- డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: మలేరియా వ్యాధి నివారణపై దృష్టి పెట్టాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొట్టాం, పిఎం.పాలేం, మెంటాడ పీహెచ్‌సీ పరిధిలో మలేరియా వ్యాధి వ్యాప్తిపై దృష్టి సారించాలన్నారు. మలేరియా వ్యాధి ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. దోమల నివారణకు ముందుస్తు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం వలస వచ్చిన వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మలేరియా నిర్ధారణ త్వరగా చేపట్టాలని చెప్పారు. జ్వర పీడితులకు రక్త నమూనాలను సేకరించి మలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యనారాయణ, డీఎంఓ మణి, డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్ ఆరు కేటగిరిలకు వేస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి క్షయ వ్యాధి, వ్యాధి నిరోధక టీకాలపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కిషోర బాలికలకు బీసీజీ వ్యాక్సిన్ గురించి అవగాహన కల్పించాలన్నారు. ఐదు సంవత్సరాల క్రితం టీబీ మందులు వాడిన వారికి, టిబి మందులు వాడిన కుటుంబ సభ్యులకు, పొగ తాగిన వారికి, మధుమేహ వ్యాధిగ్రస్తులకు, కిషోర బాలికలకు వారి అంగీకారంతో వ్యాక్సిన్ వేస్తామని తెలిపారు. జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రాణి, డీఐఓ అచ్యుత కుమారి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు

సీఎం పర్యటన బందోబస్తు పర్యవేక్షించిన డీఐజీ

విజయనగరం క్రైమ్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెల్లూరు వద్ద ఏర్పాటు చేసిన మేమంతా సిద్ధం బహిరంగ సభ ఏర్పాట్లను విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ స్వీయ పర్యవేక్షణ చేశారు. ఏపీఎస్పీ, విజయనగరం జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన పోలీస్ బలగాలు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. సభ ప్రాంగణానికి లోపలికి వెళ్లే వారిని తనిఖీలు చేసి పంపించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలెవరూ ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసి సఫలీకృతమయ్యారు. వీరి వెంట పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తదితరులు ఉన్నారు.



సభా ప్రాంగణంలో ఏర్పాట్లపై మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌తో చర్చిస్తున్న విశాఖ రేంజ్ డీఐజీ విశాల్‌గున్నీ

నేడు చంద్రబాబు, పవన్‌ల పర్యటన

విజయనగరం రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా విజయనగరం జిల్లాలో బుధవారం సాయంత్రం నిర్వహించే బహిరంగ సభలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ పాల్గొననున్నారని టీడీపీ విజయనగరం అసెంబ్లీ అభ్యర్థి పి.అదితి గజపతిరాజు తెలిపారు. అశోక్ బంగ్లాలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కలెక్టరేట్ కూడలి వద్ద నిర్వహించే కార్యక్రమానికి టీడీపీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఇమంది సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీది నియంత పాలన

- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బొబ్బిలి శ్రీను

విజయనగరం ఫోర్ట్: బీజేపీ నియంత పాలనకు చరమగీతం పాడాలంటే కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బొబ్బిలి శ్రీను అన్నారు. విజయనగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అధికారం కోసం బీజేపీ అడ్డదారులు తొక్కుతోందని ఆరోపించారు. జిల్లా సమస్యలను ప్రస్తావించడానికి పార్లమెంట్ మంచి వేదిక అని అన్నారు. తనకు ఒక అవకాశం ఇస్తే జిల్లా సమస్యలపై పార్లమెంట్‌లో గళం వినిపిస్తానన్నారు. రాష్ట్రంలో రాజన్న పాలన రావాలంటే షర్మిల నాయకత్వాన్ని బలపరచాలని తెలిపారు. ఈ నెల 24న ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కామేశ్వరరావు, అశోక్, సీపీఎం నాయకులు సూర్యనారాయణ, రమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జమ్ము ఆదినారాయణ, డోల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తుస్సుమన్న చంద్రబాబు సదస్సు

- ఆరుగురు మహిళలతోనే ముఖాముఖి
- కరణం శివరామకృష్ణ కార్యక్రమానికి దూరం
- మధ్యలోనే జారుకున్న మహిళలు

బొండపల్లి/గజపతినగరం రూరల్/దత్తిరాజేరు: బొండపల్లిలో తెలుగుదేశం పార్టీ మంగళవారం నిర్వహించిన మహిళా ప్రజా గళం సదస్సు తుస్సుమంది. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు హాజరైన సదస్సుకు ముందుగా బొండపల్లిలోని జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న లేఅవుట్‌లో ఏర్పాట్లు చేశారు. అయితే సదస్సుకు పార్టీ ఆశించిన రీతిలో మహిళలు రాలేదు. తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో సదస్సులో వేసిన కుర్చీలు సగానికి పైగా ఖాళీగానే దర్శనమిచ్చాయి. ముందుగా మాట్లాడిన నాయకుల ప్రసంగాలు శ్రద్ధగా విన్న మహిళలు చంద్రబాబు ప్రసంగం ప్రారంభించగానే ఒకొక్కరు మెల్లగా జారుకున్నారు. టికెట్ ఆశించిక రాక అలక పూనిన మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు వేదిక మీదకు రావడంతో సభలో కొంత ఉత్సాహం కనిపించింది. టికెట్ ఆశించిన భంగపడ్డ కిమిడి నాగార్జున రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడారు. టికెట్ ఆశించి భంగపడ్డ కరణం శివరామకృష్ణ ఎక్కడా కనిపించలేదు. ముందుగా హెలికాప్టర్‌లో బొండపల్లి చేరుకున్న చంద్రబాబు గజపతినగరంలోని ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ కోర్టులోని న్యాయమూర్తి బి.కనకలక్ష్మికి తన ఎన్నికల అఫిడవిట్‌ను అందజేసి ప్రమాణం చేశారు. మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు, ఎంపీ అభ్యర్థి కె.అప్పలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థులు కొండపల్లి శ్రీనివాసరావు, అభ్యర్థి బేబినాయన తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు ప్రసంగిస్తుండగా ఖాళీగా దర్శనమిచ్చిన కుర్చీలు

పుష్పాలంకరణలో పైడితల్లి



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఆలయ ప్రాంతంలో చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంతంలో చండీహోమం నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం